క్లుప్తంగా

వరినాట్లకు బీహార్ కూలీలు


వరినాట్లు వేస్తున్న బీహార్ కూలీలు

పెద్దశంకరంపేట(మెదక్): ప్రస్తుతం బోరు బావుల వద్ద రైతులు వరినాట్లు వేసే పనులను ముమ్మురం చేస్తున్నారు. కూలీల కొరత కారణంగా బీహార్‌కు చెందిన పలువురు కూలీలు మిల్లుల వద్ద పనులు చేసేందుకు వస్తుంటారు. వారు ఆయా గ్రామాల్లో వరినాట్లు వేసేందుకు ముందుకు వస్తున్నారు. ఎకరానికి రూ.4,500 నాట్లు వేసేందుకు చెల్లిస్తున్నారు. ఉదయం నుంచే కూలీలు పంట పొలాల వద్దకు వచ్చి వరినాట్లు వేస్తున్నారు.

అందరూ మొక్కలు నాటాలి


పెద్దశంకరంపేటలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): అందరూ మొక్కలు నాటాలి అని బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. శనివారం పర్యావరణ పరిరక్షణ, అమ్మ పేరుతో చెట్ల నాటడంలో భాగంగా ఆయా గ్రామాల్లో కార్యకర్తలతో కలి సి మొక్కలను నాటారు. కార్యక్రమంలో శ్రావణ్, శ్రీహరి, గంగారెడ్డి, కృష్ణ, విజయ్, అనిల్, రమేశ్ పాల్గొన్నారు.

రేబిస్ నివారణకు వ్యాక్సిన్


శునకానికి వ్యాక్సిన్ ఇస్తున్న డాక్టర్

రామాయంపేట(మెదక్): పట్టణంలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ జూనోసిస్‌డే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ తిరుపతి కుక్కలకు రేబిస్ నివారణ వ్యాక్సిన్ ఇచ్చారు. కుక్కలు, పిల్లులకు విధిగా ప్రతీ ఏడాది రేబిస్ నివారణ వ్యాక్సిన్ ఇప్పించాలని డాక్టర్ సూచించారు. సహకార సంఘం చైర్మన్ చంద్రం, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్ సమస్యలపై లేఖ

సాక్షి ఎఫెక్ట్..

పాపన్నపేట(మెదక్): కరెంట్ కట్ కట అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి స్పందించారు. ఈ మేరకు ఆయన శనివారం సీఎండీ ముషారఫ్‌కు కరెంట్ సమస్యపై లేఖ రాశారు. పాపన్నపేట సబ్ డివిజన్ పరిధిలో ముఖ్యంగా తన స్వగ్రామమైన యూసఫ్‌పేట, ఆరెపల్లి గ్రామాల్లో నెల రోజులుగా విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. రోజుకు 10 నుంచి 20 సార్లు కరెంట్ పోతుందని తెలిపారు. దీంతో రైతులు వారి నాట్లు వేయలేకపోతున్నారని చెప్పారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచిత మందుల పంపిణీ


మందులను పంపిణీ చేస్తున్న రవీందర్

మెదక్‌జోన్: స్వాత్వి చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం 50 మంది దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు హవేళిఘనాపూర్ మండలం బ్యాతోల్ గ్రామంలో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పిప్పిరి రవీందర్, డాక్టర్ పిప్పిరి చంద్రశేఖర్ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రతీ నెల స్వాత్వి చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో బీపీ, షుగర్, అస్తమా, లాంటి వ్యాధిగ్రస్తులకు వీరు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అంతే కాకుండా గ్రామంలో ఓ షెడ్డును నిర్మించగా, గ్రామస్తులు అందులో సామూహికంగా పండుగలతో పాటు ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

ట్రాక్టర్ పరికరాలు అపహరణ

పాపన్నపేట(మెదక్): వ్యవసాయ క్షేత్రం వద్ద నిలిపి ఉంచిన ట్రాక్టర్ నుంచి పరికరాలను గుర్తు తెలియని దుండగులు దొంగిలించిన సంఘటన మండలంలోని ఎల్లపూర్ గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. పట్నం మహేందర్ తన వ్యవసాయ క్షేత్రంలో దుక్కి దున్నేందుకు ట్రాక్టర్‌ను తీసుకొని వెళ్లాడు. చీకటి పడడంతో అక్కడే ట్రాక్టర్‌ను వదిలి ఇంటికి వచ్చాడు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ట్రాక్టర్ పరికరాలతో పాటు డీజిల్ సైతం దొంగిలించినట్లు తెలిపారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచండి

- కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల నిరసన దీక్ష


కలెక్టరేట్ సమీపంలో నిరసన దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు

మెదక్ కలెక్టరేట్: అంగన్‌వాడీలో రిటైర్మెంట్ పొందే టీచర్లకు బెనిఫిట్స్ పెంచాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మెదక్ కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద అంగన్‌వాడీల డిమాండ్ల పరిష్కారం కోసం నిరసన దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు తక్షణమే రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్‌కు రెండు లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష చొప్పున ఇవ్వాలన్నారు. అలాగే వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలన్నారు. గత ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మె సందర్భంగా టీచర్‌కు రూ. 2 లక్షలు, హెల్పర్స్‌కు రూ.లక్ష, పెన్షన్, వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు గడుస్తున్నా.. అంగన్‌వాడీలపై కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. పాత జీవో 10ను తెచ్చి 65 ఏళ్లు నిండిన వారిని నిర్దాక్షిణ్యంగా ఇంటికి పంపాలని చూడటం దుర్మార్గం అన్నారు. అంగన్‌వాడీలకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలని, వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు రూ.26,000 ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి, టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


కొండాపూర్‌లో మాట్లాడుతున్న వైద్యులు

మనోహరాబాద్(తూప్రాన్): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, బయటి పదార్థాలపై జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యంపై తగు చర్యలు తీసుకోవాలని మండల పీహెచ్‌సీ వైద్యులు వికాస్ అన్నారు. శనివారం మనోహరాబాద్ మండల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఉచిత క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రియాంక, ఏఎన్ఎంలు వరలక్ష్మి, స్వర్ణలత, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు ఇప్పించండి


బీజేపీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న తాజా మాజీ సర్పంచ్‌లు

మనోహరాబాద్(తూప్రాన్): గత సర్పంచ్‌ల హయాంలో పెండింగ్ బిల్లులను వచ్చేలా కృషి చేయాలని బీజేపీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్‌రెడ్డిని రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ ఉపాధ్యక్షుడు మల్లేశ్ వినతి పత్రం అందజేశారు. శనివారం పలువురు మాజీ సర్పంచ్‌లు ఆయనను హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలిసి సర్పంచ్‌లకు వచ్చే పెండింగ్ బిల్లుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆయనను కోరినట్లు తెలిపారు. వీరి వెంట చంద్రశేఖర్, నాగరాజు తదితరులు ఉన్నారు.

నిధులు మంజూరు చేయాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న కౌన్సిలర్

నర్సాపూర్: మున్సిపాలిటీలోని రెండో వార్డు సునీతారెడ్డి కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కౌన్సిలర్ లత కోరారు. శనివారం కలెక్టర్ ఆర్డీఓ ఆఫీసులో అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె కలెక్టర్‌ను కలిసి అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేక పిల్లలు, వారి తల్లులు, నిర్వాహకులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారని ఆమె చెప్పారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


క్రీడా సామగ్రిని అందజేస్తున్న చక్రపాణి

రేగోడ్(మెదక్): విద్యార్థులు క్రీడల్లో రాణించాలని యూత్ కాంగ్రెస్ యువ నాయకుడు చక్రపాణి అన్నారు. మండల కేంద్రం రేగోడ్‌లోని మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, గజ్వాడ, టి.లింగంపల్లి, జగిర్యాల పాఠశాలల్లో రూ.65వేల క్రీడా సామగ్రిని అందజేశాడు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు తనవంతు సాయంగా క్రీడా సామగ్రిని పంపిణీ చేశానని చెప్పారు. చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి సన్మానం


కేంద్ర మంత్రిని సన్మానిస్తున్న రమేశ్‌గౌడ్

నర్సాపూర్: కేంద్ర మంత్రి బండిసంజయ్‌ని శనివారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కలిసినట్లు బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్ చెప్పారు. మంత్రిని కలిసి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించినట్లు తెలిపారు. తన వెంట పలువురు నాయకులు ఉన్నారన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఐదు ఎకరాలలోపు పట్టాభూమి ఉండి పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి ఉన్న రైతుల ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ శ్యామ్ అన్నారు. శనివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం నుంచి పండ్ల తోటల్లో గుంతలు తీయడానికి, మొక్కలు నాటేందుకు, మొక్కకు ఊత కర్ర, మొక్క కొనుగోలుకు, ఎరువులకు, మూడేళ్ల వరకు యాజమాన్య డబ్బులు వస్తాయన్నారు. అదేవిధంగా ప్రతీ నెల వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఈ దరఖాస్తులకు ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు అర్హులని, కచ్చితంగా జాబ్ కార్డు, బోరుబావి, విద్యుత్ సౌకర్యం ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న రైతులు రైతు దరఖాస్తు పత్రం, పట్టాబుక్కు, బ్యాంకు ఖాతా బుక్కు, ఆధార్‌కార్డు, ఉపాధి జాబ్ కార్డు, పాన్‌కార్డు జిరాక్స్‌లు, 3 పాస్‌పోర్ట్ ఫొటోలు, గ్రామ పంచాయతీ తీర్మానం ఏఈఓ, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు అందజేయాలన్నారు.

విద్యార్థులకు డిజిటల్ తరగతులు


విద్యార్థులకు డిజిటల్ తరగతుల ద్వారా బోధన చేస్తున్న ఉపాధ్యాయులు

పెద్దశంకరంపేట(మెదక్): ఆయా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్ తరగతులు కొనసాగుతున్నాయి. డిజిటల్ క్లాస్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల నోడల్ అధికారి వెంకటేశం సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా పాఠశాలలో కొనసాగుతున్న డిజిటల్ క్లాసులతో కలిగే లాభాల గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించాలని పేర్కొన్నారు. వారికి అర్థమయ్యేలా సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన బోధన కొనసాగుతుందని తెలిపారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు నివాళి

టేక్మాల్(మెదక్): మండల పరిషత్‌లో శనివారం ఆదర్శ యువజన సంఘం ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఇందులో తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ రియాజొద్దీన్, ఆదర్శ యూత్ అధ్యక్షుడు శేషు, నాయకులు రవి, సలీమ్, మజహర్, అడివప్ప, భాస్కర్, గోవిందచారి, సాయి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థి ఎంపిక


భారత్ కుమార్

తూప్రాన్: ట్రిపుల్ ఐటీకి పట్టణానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన పర్స యాదగిరి, వసంత దంపతుల కుమారుడు భారత్‌కుమార్ ఎంపికయ్యాడు. అతని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేం


నర్సాపూర్‌లో శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


రామాయంపేటలో శ్యాంప్రకాశ్ చిత్రపటానికి నివాళులర్పిస్నున్న బీజేపీ కార్యకర్తలు

నర్సాపూర్: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివని బీజేపీ నాయకులు అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని పార్టీ కార్యాలయంలో శనివారం శ్యాం ప్రసాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజేందర్, పార్టీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ రమణరావు, పార్టీ నాయకులు బుచ్చేష్‌యాదవ్, నగేష్, ఆంజనేయులుగౌడ్, ప్రేంయాదవ్, రమేశ్‌యాదవ్, భరత్‌రాం తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని మండల బిజెపి అధ్యక్షుడు విఠల్ అన్నారు. పేట పార్టీ కార్యాలయంలో శ్యాంప్రసాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రావణ్, కృష్ణ, శ్రీహరి, సాయిలు, సుభాష్ తదితరులున్నారు.

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు బీజేపీ నాయకులు కార్యకర్తలు సుమారు 50 చెట్లు నాటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు గెరిగేంటి బాబు, మేకల రమేశ్, సీనియర్ నాయకులు సిద్ధరాంరెడ్డి, ఆముదరాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): పట్టణంలో బీజేపీ కార్యకర్తలు శనివారం శ్యాంప్రకాశ్ ముఖర్జీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు భానుచందర్, మండలాధ్యక్షుడు దయానందరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతల శేఖర్, రాష్ట్ర నాయకుడు నవాత్‌రాజు, ఇతర నాయులు రమేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వరినాటే పద్ధతిపై క్షేత్ర ప్రదర్శన


లింగాపూర్‌లో డ్రం సీడర్ పద్ధతిని వివరిస్తున్న వ్యవసాయ అధికారులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని లింగాపూర్‌లో మండల వ్యవసాయ అధికారులు శనివారం సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైలాండ్ అగ్రికల్చర్, హైదరాబాద్ వ్యవసాయ డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనే రైతు తన పొలంలో డ్రం సీడర్‌తో వరివిత్తే పద్ధతిని క్షేత్ర సందర్శన చేసి, క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి దీపిక మాట్లాడుతూ.. ఈ పద్ధతిలో వరి విత్తడం ద్వారా నారు పోయడం, నాటు పెట్టడం లేకుండా నేరుగా వరి విత్తుకోవచ్చు వివరించారు. సంప్రదాయ పద్ధతిలో కన్న ఈ పద్ధతిలో విత్తడంతో విత్తన మోతాదు కూడా తగ్గించుకోవచ్చన్నారు. దూరం దూరం విత్తడం వల్ల సూర్యరశ్మి, గాలి మంచిగా తాకి పిలకలు బలంగా పెరిగి, చీడ పీడల బెడద కూడా తగ్గుతుందన్నారు. పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవడమే కాకుండా దిగుబడి కూడా పెరిగే అవకాశం ఉందని రైతులకు విద్యార్థులకు తెలిపారు. రైతులు ఇలాంటి ఆధునిక పద్ధతులు అవలంభించి అధిక దిగుబడి సాధించాలని రైతులకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉప్పలపు లక్ష్మీనర్సయ్య, శంకర్, అశోక్, శ్రీనివాస్, బోయిని నర్సయ్య, విద్యార్థులు అఖిల్, అశోక్, మౌనిక, రిషిక, మనిదీప్, వ్యవసాయ విస్తరణ అధికారి దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్, కేసు నమోదు

మనోహరాబాద్(తూప్రాన్): అర్ధరాత్రి పేకాట ఆడుతున్న వారిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుభాష్‌గౌడ్ శనివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జీడిపల్లి గ్రామంలో అర్ధరాత్రి పేకాట ఆడుతున్నారనే సమాచారంతో నలుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ. 22 వేల 460, మూడు సెల్‌ఫోన్లు, పేకాట ముక్కలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ విషయమై నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు. మండలంలో పేకాట, అసాంఘీక కార్యకలాపాలపై తమకు సమాచారం ఇవ్వాలని, అసాంఘీక చర్యలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు పోలీసులు సూచించారు.

కాట్రియాలలో వర్షాల కోసం పూజలు


కాట్రియాలలో హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు


రేగోడ్(మెదక్): నిండు కలశాలతో మర్పల్లి గ్రామస్తులు

రామాయంపేట(మెదక్): మండలంలోని కాట్రియాల గ్రామంలో శనివారం గ్రామస్తులు వర్షా ల కోసం ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో బిందెల్లో నీరు తీసుకెళ్లి శివాలయంలో అభిషేకం నిర్వహించారు. అనంతరం హనుమాన్ ఆలయంలో పూజలు చేసి, అభిషేకం చేశారు.

రేగోడ్(మెదక్): వర్షాలు సకాలంలో కురిపించమని రైతులు ఆలయాల్లో పూజలు చేశారు. మండలంలోని మర్పల్లి గ్రామస్తులు అనంతసాగర్ హనుమాన్ ఆలయం నుంచి భజన కీర్తనలతో పదకొండు గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామంలోని హనుమాన్ ఆలయంలో జలభిషేకం చేశారు.

పాఠశాల గ్రౌండ్‌లో వర్షం నీరు

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు


పాఠశాలలో చిన్నపాటి వర్షానికే చేరిన నీరు

కౌడిపల్లి(నర్సాపూర్): చిన్నపాటి వర్షానికి పాఠశాల గ్రౌండ్‌లో వర్షంనీరు చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం కౌడిపల్లిలోని ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో శుక్రవారం రాత్రి కురిసిన చిన్నపాటి వర్షానికే నీరు చేరింది. దీంతో విద్యార్థులు తరగతి గదిలోకి వెళ్లేందుకు నీటిలో నుంచి వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య తీర్చాలని కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు హోలియా దాసరి కుల సమావేశం

నర్సాపూర్: హోలియా దాసరి కుల సమావేశం ఈనెల 7న ఏర్పాటు చేశారని హోలియా దాసరి సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి శాఖమూరి యాదగిరి చెప్పారు. హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్ రోడ్‌లోని ఏఐటీయూసీ హాల్‌లో సమావేశం ఉందని కోరారు.

◆ ఆర్టీసీ బస్సు తగిలి బాలుడికి గాయాలు

నర్సాపూర్: రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు తగిలి బాలునికి గాయాలయ్యాయి. శనివారం ఉదయం బస్టాండ్ ఎదురుగా మెదక్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బస్టాండ్‌లోకి వస్తుండగా రోడ్డు దాటుతున్న బాలుడు తేజుకు బస్సు ముందు చక్రాలు తగలడంతో కాలుకు గాయాలయ్యాయి. రోడ్డు పక్కన దుకాణాదారులు ఇది గమనించి ఈ విషయాన్ని బస్సు డ్రైవర్‌ను పిలిపించి బాలుడికి చికిత్స చేయించాలని సూచించగా, బాలుడికి చికిత్స చేయించి అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

◆ బసవ కల్యాణ్‌కు తరలిన భక్తులు

కొల్చారం(నర్సాపూర్): రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామివారి ఆధ్వర్యంలో ఆదివారం కర్ణాటక రాష్ట్రంలోని బసవ కల్యాణ్‌లోని సదానంద మఠంలో నిర్వహించే ప్రత్యేక పూజలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు మండలం నుంచి పెద్ద ఎత్తున భక్తులు శనివారం బసవ కల్యాణ్ తరలివెళ్లారు. మహారుద్ర పరంపరలో భాగంగా పీఠానికి, సాంప్రదాయానికి మూలంగా నిలిచిన శ్రీ సదానంద ఆశ్రమంలో మహారుద్రం, సహస్ర మన్య సూత్రం, లక్ష పుష్పార్చన, ఉంటాయని భక్తులు తెలిపారు.

◆ అంతర్జాతీయ సహకార దినోత్సవం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం ఆవరణలో సీఈఓ నవీన్ సహకార సంఘ పతాకాన్ని ఎగరవేశారు. కార్యక్రమంలో సంఘం సిబ్బంది బీరప్ప, శ్రీనివాస్, సిద్ధు, రైతులు పాల్గొన్నారు.

◆ నారుమడుల పరిశీలన

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని ఫరీద్‌పూర్ గ్రామంలో రైతులు సాగు చేసిన జీలుగ, వరి నారుమడులను ఏవో నాగమాధురి పరిశీలించారు. అనంతరం రైతులు నారుమడులకు సూక్ష్మజీవులు సోకకుండా జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. జీలుగ పెంచడం వల్ల ఉపయోగాలను వివరించారు.

◆ చాకరిమెట్లలో భక్తుల పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని చాకరిమెట్ల అరణ్యంలో కొలువైన సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్, ఆలయఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవదత్త శర్మలు తెలిపారు.

◆ మొక్కలు నాటిన నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రధాని పిలుపు మేరకు మండలంలో బీజేపీ నాయకులు శనివారం మొక్కలు నాటారు. మండలంలోని పెద్దగొట్టిముక్కులలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీరారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఓబీసీ ఉపాధ్యక్షుడు, మండలాధ్యక్షుడు పెద్దపులి రవి, ఉపాధ్యక్షుడు నారాయణగారి వినోద్, బీజేవైఎం ఉపాధ్యక్షుడు భాస్కర్, నాయకులు కొండల్‌రావు, ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు భిక్షపతి, భాస్కర్, సంజీవ, రాంజీనాయక్, సికిందర్, నాగులు, నర్సింలు, శ్రీశైలం, తలారి నర్సింలు, బాలమల్లేశ్, శివశంకర్, పోచయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ అన్నప్రాసన

రేగోడ్(మెదక్): మండలంలోని దోసపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం విద్యార్థులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ అనిత మాట్లాడుతూ.. చిన్నారులకు అన్నప్రాసన చేశామని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ జయలక్ష్మి, ఆయాలు సంగమ్మ, బుజ్జమ్మ, డాక్టర్ జెస్సీ పాల్గొన్నారు.

◆ ఆలయంలో చోరీ

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని రాంపూర్ గ్రామ శివారులోని పెద్దమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హుండీ పగలగొట్టి చోరీ చేశారు. హుండీలో సుమారు రూ.5 వేలు ఎత్తుకెళ్లారని ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి శనివారం చెప్పారు. ఆలయ అర్చకుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264